చీకటి పడేవేళ అతనులేచాడు. ఇంక గంటమాత్రమే టైముంది, రైలు రావడానికి తాను చావడానికీ. గబగబా నడవడం మొదలుపెట్టాడు. వంతెనదాటాడు. పొలాలమ్మట పడిపోవడం మొదలు పెట్టాడు. అక్కడ రైలు పట్టాలవద్ద జన సంచారం ఉండదు. స్టేషన్‌కి మైలుపైగా దూరం వుంటుంది. అక్కడ అటూ ఇటూ చెట్లు గుబురుగా వుంటాయి. రైలు అక్కడ మలుపు తిరుగుతుంది. అక్కడ తల పెట్టితే రైలు వస్తూవున్నట్లే తెలియదు. హఠాత్తుగా రైలు మలుపు తిరిగి మీదనుంచి తెలియకుండా పోతుంది. వెంకటేశ్వర్లు పట్టుదలగా రెండు పొలాల మధ్యఉన్న దారమ్మట నడుస్తున్నాడు.

అరుణ వర్ణంలోనుంచి నలుపులోకి మారుతున్న మబ్బులూ నల్లగా బొద్దుగా ఉన్న తుమ్మచెట్లు, దిగులు దిగులుగా ఏడుస్తూన్నట్లు వీచేగాలి, పిట్టల పురుగుల అస్పష్టపు కూతలు అన్నీ అతన్ని 'చచ్చిపో, చచ్చిపో' అని హెచ్చరిస్తున్నట్లున్నాయి. ప్రకృతి అంతా అతని చావు కోరుతూన్నట్లు, అతన్ని చావుకి తరుముతూన్నట్లు ఉంది.

'ఏయ్ వెంకటేశ్వర్లూ—నిన్నే ఆగవోయ్'—కేక.

వెనకాల సైకిలు మీద సూర్యనారాయణ. వెంకటేశ్వర్లు నిలుచున్నాడు. సూర్యనారాయణ రోజూ బడి వదలగానే అడ్డదారిని అక్కడికి దగ్గర్లోఉన్న అత్తవారి వూరు వెళతాడని వెంకటేశ్వర్లుకి తెలుసును.

'ఇలా ఎక్కడికోయ్—' అన్నాడు సూర్యనారాయణ తనుపని చేసిన ఎలిమెంటరీ స్కూల్లో మేష్టరు.

'నీకేమైనా బుద్ధివుందా? నువ్వేమైన మనిషివా'? అన్నాడు సూర్యనారాయణ కోపంగా.

హతబుద్ధియై చూస్తున్నాడు వెంకటేశ్వర్లు. అతనికి కోపం రాలేదు. సూర్యనారాయణ ఏమంటున్నాడో అర్థం కాలేదు.

'మనకులం మన గౌరవం ఏమైనా నిలబెట్టేట్టు ఉన్నావా? నీమూలాన్ని మేమందరం తలెత్తుకు తిరగాలా అక్కర్లేదా? ఛీ, సిగ్గుండాలి కన్నకూతుర్ని పబ్లిక్‌గా

నడవలో పడుకున్న వెంకటేశ్వర్లుకి అర్ధరాత్రి మెలకువవచ్చింది. అతన్ని ఏదో ఎప్పుడూ ఎరగని సుఖమూ తృప్తీ చుట్టుకొన్నాయి. అతనికి అందర్నీలేపి సరదాగా కబుర్లు చెప్పాలనిపించింది. అతను చిన్నతనంలో నేర్చుకున్న గీత గోవిందం పాట పాడాలనిపించింది. చటుక్కున అతనికి ఏదో తప్పుచేసినట్టనిపించింది. ఇంత ఆనందానికీ సుఖానికీ కారణమైన పెద్దకూతుర్ని తానభినందించనేలేదు. దగ్గరగా వెళ్ళి 'అమ్మా నేసంతోషిస్తున్నాను'. అనొద్దూ! తాను కృతఘ్నుడుగా ఎలావుండగలడు. అతను లేచి గదిలోకి చూశాడు. అక్కడ జయలేదు. నాలుగు వైపులా చూశాడు. జయలేదు. పెరటి తలుపులు తీసి చూశాడు. దొడ్లో జాదంచెట్టుకింద జయ కూర్చొని వుంది. చవితి నాటి వెన్నెలలో స్పష్టాస్పష్టంగా గోచరిస్తోంది. ఆమె జుట్టు వీడిపోయి మొహం మీదా భుజాల మీదా పడుతోంది. ఆమె మోకాళ్ళలో మొహం పెట్టుకుని వుంది. వెంకటేశ్వర్లు ఆమెవైపు రెండడుగులు వేశాడు కాని యింతలో ఆమె వెక్కి వెక్కి ఏడుస్తూన్నట్టు చప్పుడు వినిపించింది అతనికి అర్థం అవలేదు. ఓ నిముషం ఆమెవైపే చూసి చప్పుడు కాకుండా వెనక్కి తిరిగి వచ్చి నడవలో పడుకున్నాడు. 'ఈ వేళకాదు. మరెప్పుడైనా కృతజ్ఞత చెపుతాను.' అనుకుని కళ్ళు మూసుకున్నాడు.

★

( కీ॥ శే॥ శ్రీ తిలక్ అముద్రిత కథలలో ఇది ఒకటి. దీనిని సృజన కోసం ప్రత్యేకంగా పంపించిన వారి సోదరులు శ్రీ గంగాధర రామరావుగారికి కృతజ్ఞతలు—

సృజన. )

గత సంచికలో ప్రకటించినట్లుగా ఈ సంచికలో 'మధురకవి తిలక్' అనే రచన ప్రచురించలేకపోతున్నందుకు విచారిస్తున్నాము—సృజన.